దంపతుల మధ్య గొడవ
భర్త హతం

ఆదిబట్ల, జనవరి 7 : భర్తను ఓ మహిళ కిరాతకంగా హత్య చేసింది. ఈ ఘటన మంగళవారం ఆదిబట్ల ఠాణా పరిధిలో జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం..ఏపీలోని శ్రీకాకుళం జిల్లా గొల్లపూరు గ్రామానికి చెందిన అంకుల షణ్ముఖరావు, భార్య ఉమాపతితో కలిసి హైదరాబాద్‌కు వచ్చారు. తుర్కయాంజాల్, బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలోని రాగన్నగూడలో గత ఆరు నెలలుగా ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. షణ్ముకరావు మేస్త్రీగా పనిచేస్తుండగా..ఆయన భార్య కూలీ పనులు చేస్తున్నది. కాగా సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో షణ్ముకరావును ఆయన భార్య ఉమా దాడి చేసి చంపేసింది. మంగళవారం ఉదయం షణ్ముకరావుతో కలిసి పని చేసే కొంతమంది మేస్త్రీలు వచ్చి తలుపు కొట్టడంతో ఉమా తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని చెప్పింది. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని నాగం శ్రీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులకు ఘటనాస్థలికి చేరుకుని, మృతుడి భార్యపై అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంగ్ల బోధనకు ప్రాధాన్యమివ్వాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో మీటింగ్

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 7 : ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యమివ్వాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషను సులభంగా బోధించే విధానంపై ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, ఆంగ్ల భాషకు ప్రాధాన్యమివ్వాలన్నారు. డిసెంబర్ మాసం లోపు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్లంలో నైపుణ్యాన్ని పెంపొందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చడంతోపాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహరతి, డీఈవో రేణుకాదేవి, వయోజన విద్య అధికారి శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ స్టాంపులపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులు చిన్నతనం నుంచే పోస్టల్ స్టాంపులపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజులపాటు జరుగనున్న ప్రత్యేక స్టాంపుల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. జనవరి 7 నుంచి 9 వరకు అనంతగిరి ఫెక్స్ పేరిట తపాలా శాఖ ప్రత్యేక స్టాంపుల ప్రదర్శనను నిర్వహిస్తున్నదన్నారు. జిల్లాలో మొదటిసారిగా ఫిలాసఫీ ఎగ్జిబిషన్‌ను మూడు రోజులపాటు ఏర్పాటు చేశామని, ఇందులో వ్యాస రచన, క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అనంతగిరి ఫెక్స్ లోగోను తపాలా శాఖ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ప్రసాద్, శ్రీనివాస్, పోస్టల్ శాఖ సిబ్బంది కేశవారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెప్రగతితో ప్రగతిపథంలో గ్రామాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పల్లెప్రగతి కార్యక్రమంతో తెలంగాణలోని గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని బీహార్ రాష్ట్రానికి చెందిన బ్లాక్ ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి సంస్థలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ ఐఆర్డీపీఆర్‌లో అధికారులు, బీహార్ రాష్ట్రానికి చెందిన బ్లాక్ స్థాయి ప్రతినిధులతో ఆయన సమావేశమై.. తెలంగాణలోని గ్రామాల్లో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, తడి-పొడి చెత్త వేరు చేసే విధానం, పల్లెప్రకృతి వనం, రైతువేదిక, వైకుంఠధామాల నిర్మాణం, పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలను వారికి లక్ష్మీనర్సింహారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ప్రత్యూష్ణాపట్నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రోగ్రామ్ మేనేజర్ అరుణ్‌రాజ్, బీహార్ రాష్ట్ర బ్లాక్ ప్రతినిధులు జయమాల, దీపక్, శంకర్, మందాల్‌జీ, రాజీవ్‌కుమార్, శంకర్‌కుమార్ మండల్, దీపక్‌కుమార్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

-కడ్తాల్, జనవరి 7

నిధులేమో కేంద్రానివి.. బిల్డప్ రాష్ట్రానిది..

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- ఎంపీఏవై-యూ నిధులను ఇందిరమ్మ ఇండ్లకు వినియోగించొద్దు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

కొడంగల్, జనవరి 7 : ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన పథకం (ఎంపీఏవై-యూ)కింద ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే..రేవంత్ సర్కార్ మాత్రం ఆ నిధులను తామే కేటాయించామని బిల్డప్ ఇస్తున్నదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. మంగళవారం అమృత్ భారత్-2 పథకం కింద మున్సిపల్ పరిధిలో మంజూరైన రూ.4.5 కోట్లు నిధులకు సంబంధించిన పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం నిధులను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వాడుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎంపీఏవై-యూ కింద కేంద్రం నిధులు కేటాయిస్తే.. గ్రామాల్లో ఇండ్లను మేమే నిర్మిస్తున్నామని రాష్ట్ర సర్కారు పేర్కొంటున్నదన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు గూడును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గొప్ప పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అమృత్ భారత్-2 పథకంలో కొడంగల్ సెగ్మెంట్‌కు రూ.17 కోట్లు మంజూరు కాగా.. ప్రస్తుతం ఆ నిధు ల్లో నుంచి రూ. 4.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పైప్‌లైన్లు, ట్యాంకులు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ అధికారులు డీఈ సాజిత్, ఈఈ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తిరుపతిరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

హత్యకు గురైన కానిస్టేబుల్ నాగమణి భర్త శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ప్లాన్ ప్రకారమే..
కానిస్టేబుల్ నాగమణి హత్య

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 7 : మండలంలోని రాయపోల్ గ్రామం లో గత నవంబర్‌లో జరిగిన కానిస్టేబుల్ నాగమణి హత్య పథకం ప్రకారమే జరిగిందని, నిందితులు ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. మంగళవారం ఆయన నాగమణి కుటుంబసభ్యులను ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి పరామర్శించి మాట్లాడారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో కులా ల మధ్య అంతరాలుండడం చాలా బాధాకరమన్నారు. నాగమణి హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తున్నదని అసహనం వ్యక్తం చేశారు. నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబానికి రక్షణ కల్పించడం తోపాటు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం నుంచి భూమి, ఇల్లు అందజేస్తామన్నారు. ఆయనతోపాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, పోలీసులు పాల్గొన్నారు.

యాచారంలో రోడ్డును కమ్మేసిన పొగమంచు



మంచు దుప్పటిలో..

రోడ్లను కమ్మేసిన పొగమంచు

మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచే పొగమంచు కమ్మేసింది. సూర్యు డు ఉదయించినా పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, పాలు, పూల వ్యాపారులు, రైతులు, రోజువారీ కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

-యాచారం, జనవరి 7

ధారూరులో
విజిలెన్స్ తనిఖీలు

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న 5 క్లినిక్‌లపై కేసు

ధారూరు, జనవరి 7 : మండల కేంద్రం లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఐదు ప్రైవేట్ క్లినిక్‌లపై కేసులు నమోదు చేసినట్లు ధారూరు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి రాము మండల కేంద్రంలోని ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందు లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగు తున్న ఐదు క్లినిక్‌లు, ఎంబీబీఎస్ డాక్టర్ల మాదిరిగా చికిత్స చేస్తున్న ఐదుగురు ఆర్ఎంపీలు (1)మీర్ ఇషాక్ అలీ, (2) పత్తి అనిల్‌కుమార్, (3) అశోక్‌కుమార్, (4) మహమ్మద్ ఆజాం, (5) సునీల్‌లపై విజిలెన్స్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధారూరు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి మెట్రో సంక్రాంతి ఉత్సవాలు

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ సంబురాలను వైభవంగా నిర్వహించేందుకు హైదరాబాద్ మెట్రో సన్నాహాలు చేస్తున్నది. నేటి నుంచి మూడు రోజుల పాటు 'మీ టైం ఆన్‌మై మెట్రో' క్యాంపెన్ పేరిట వేడుకలను నిర్వహిస్తున్నది. పండుగ సంబురాలను ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభించనున్నారు. వేడుకల్లో భాగంగా తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు, తెలుగు ఔన్నత్యాన్ని చాటేలా వేడుకలను నిర్వహించేందుకు ఎల్ అండ్ టీ ఏర్పాట్లు చేసింది. నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో ఈ వేడుకలు ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భావన

పెద్దఅంబర్‌పేట, జనవరి 7 : పెద్దఅంబర్‌పేట లోని రాజశ్రీ విద్యామందిర్‌లో ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థిని పిట్టల భావన జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఏడాది వ్యవధిలోనే మూడోసారి రాష్ట్ర జట్టుకు ఎంపికై సత్తా చాటింది. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో జరుగనున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 ఖోఖో పోటీల్లో భావన పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి, కోచ్ నీలేశ్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన భావనను పాఠశాల ప్రతినిధులు జగన్మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

దోమ ఎంఈవోకు అవార్డు

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న దోమ ఎంఈవో వెంకట్‌కు హైబిజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సలెంట్ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని నోవాటెల్ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఎక్సలెంట్ 2024 అవార్డును ప్రముఖుల నుంచి అందుకున్నారు.

-దోమ, జనవరి 7

డైవర్షన్ కోసమే కేటీఆర్‌పై కేసులు

కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు

రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా హస్తం పార్టీ కుట్రలకు తెరలేపుతున్నదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు మండిపడుతున్నారు. పాలన చేతకాక బీఆర్ఎస్ ముఖ్య నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు.

- కంటోన్మెంట్, జనవరి 7

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు పెట్టగానే ఈడీ వచ్చింది. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై ఎమ్మెల్సీ కవితను జైలుకు పంపారు. ప్రస్తుతం కేటీఆర్, కవిత, హరీశ్‌రావుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రేవంత్ అబద్ధాల అలవాటు మార్చుకోవడం లేదు. నిన్నటి వరకు కాళేశ్వరం సహా అనేక విషయాలపై అబద్ధాలు మాట్లాడారు. ఇప్పుడు ఫార్ములా ఈ రేస్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారు. దేశంలోనే ఫార్ములా ఈ కార్ రేస్ జరిగింది హైదరాబాద్‌లోనే. ఫార్ములా ఈ కార్ రేస్ వల్ల రాష్ట్రానికి రూ. 700 కోట్ల ఆదాయం సమకూరింది.

- జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు

కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే ఉద్యమం తప్పదు..

సర్కారు కక్ష పూరింతగా కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే మరో ఉద్యమం తప్పదు. ఈ రేస్‌ను కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాకే రాష్ట్రంలో నిర్వహించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోం. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలికి పాలనపై దృష్టి కేంద్రీకరించాలి.

- గజ్జెల నాగేశ్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఆరోపణలు నిరాధారం

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు విషయంలో ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు నిరాధారం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను పక్కదారి పట్టించడానికి, వీటిపై రైతుల్లో, ప్రజల్లో చర్చకు రానివ్వకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా పెట్టిన చెత్త కేసు ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ.. రైతాంగాన్ని మేల్కొపుతున్న కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

- మన్నె క్రిశాంక్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ, మాజీ చైర్మన్

నత్తనడకన..

ప్రారంభమే కాని భూసేకరణ

- నెమ్మదిగా సాగుతున్న జేపీ దర్గా రోడ్డు విస్తరణ పనులు
- హెచ్ఆర్‌డీసీఎల్ నుంచి 100 ఫీట్ల రోడ్డు కోసం రూ. 18 కోట్లు మంజూరు
- భవిష్యత్తు అవసరాల కోసం 100 ఫీట్లు నిర్మించాలంటున్న మున్సిపల్ ప్రజలు

ఫూలే చౌరస్తా నుంచి నాట్కో చౌరస్తా వరకు జరుగుతున్న రోడ్డు పనులు

కొత్తూరు, జనవరి 7 : అది మున్సిపాలిటీలోని రద్దీతో కూడిన రోడ్డు. అంతేకాకుండా చౌరస్తా నుంచి మొదలుకొని జేపీ దర్గాకు వెళ్లే రోడ్డులో సమీకృత మార్కెట్, ఠాణా, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాయాలతోపాటు పరిశ్రమలూ ఉన్నాయి. ముఖ్యంగా జహంగీర్ పీర్ దర్గాకు ప్రతి అరగంటకు ఒకటి చొప్పున బస్సు వెళ్తుంది. అంతటి రద్దీ గల రోడ్డు విస్తరణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందుకు హెచ్ఆర్‌డీసీఎల్ రూ.18 కోట్లు మంజూరు చేసింది. అయితే పూలే చౌరస్తా నుంచి నాట్కో చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా 100 ఫీట్ల వరకు రోడ్డును విస్తరించాల్సి ఉండగా.. ఆ పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు.

100 ఫీట్ల రోడ్డు నిర్మాణం కలేనా ?

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రోడ్డు మధ్యలో రెండు వైపులా 50 ఫీట్ల చొప్పున మొత్తం 100 ఫీట్ల వరకు రోడ్డును విస్తరించాల్సి ఉన్నది. చౌరస్తా వద్ద ఉన్న ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వేగం పుంజుకోని పనులు

కొత్తూరు పూలే చౌరస్తా నుంచి నాట్కో చౌరస్తా వరకు రోడ్డు పనులు జరుగుతున్నా వేగం పుంజుకోవడం లేదు. చాలా నెమ్మదిగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై హెచ్ఆర్‌డీసీఎల్ డిప్యూటీ ఈఈ విక్రమ్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు ఈ పనులతోపాటు మరో 50 వరకు పనులున్నాయని.. అన్నింటినీ సమాంతరంగా చేస్తున్నారని వివరించారు.

భూసేకరణపై మున్సిపల్ కమిషనర్ బాలాజీని సంప్రదించగా 100 ఫీట్ల రోడ్డు నిర్మించాల్సి ఉన్నా భూసేకరణ సాధ్యం అయ్యేలా లేదన్నారు. కనీసం 60 ఫీట్ల రోడ్డు కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకోసం భూయజమానులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. అంతకన్నా ముందు ఆక్రమణలు లేనిచేట పనులను చేపట్టాల్సిన బాధ్యత హెచ్ఆర్‌డీసీపై ఉందన్నారు.

డబుల్ గృహాలకు మెయింటెనెన్స్ చార్జీలు

ఇంటికి నెలకు రూ.2వేలు వసూలు

అధికార పార్టీ నేతల అండదండలతో దందా...?

ఖైరతాబాద్, జనవరి 7 : పేదలకు నీడ కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం వేలాదిగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి.. ఎంతో మంది సొంతింటి కలను నిజం చేసింది. అయితే పటాన్‌చెరు సెగ్మెంట్ పరిధిలోని రామచంద్రాపురం మండలం, కొల్లూరు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రస్తుతం కొందరికీ కాసుల పంట పండిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడ సౌకర్యాలను విస్మరించడంతో పలువురు గృహాలకు తాళాలు వేసి మళ్లీ అద్దె గృహాల్లోకి వెళ్లిపోయారు. దానిని ఆసరాగా చేసుకున్న కొందరు ఒక్కో ఇంటికి అక్రమంగా మెయింటెనెన్స్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. డబ్బులు ఇవ్వకుంటే పట్టాలను రద్దు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఒక్కో ఇంటికి రూ.2వేలు

2018లో సుమారు 145 ఎకరాల్లో రూ.1,489.29 కోట్లతో 117 బ్లాకుల్లో, సిల్ట్ + 9, 10, 11 అంతస్తుల్లో 15,660 ఇండ్లను చేపట్టారు. 2023 జూన్ నాటికి నిర్మాణం పూర్తయ్యింది. నగరంలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం విడతల వారీగా అందించింది. 2023 నవంబర్‌లో ఎన్నికల నగరా మోగగా, గృహాల పంపిణీకి బ్రేక్ పడింది. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్రూం గృహ యజమానులకు ఇక్కట్లు మొదలయ్యాయి. కరెంట్, నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. నిర్వహణ బాధ్యతలను అధికార యంత్రాంగం విస్మరించింది. అనేక మంది సొంతింటిని వదిలి తిరిగి అద్దె గృహాలకు వెళ్లిపోయారు. అదునుగా భావించిన కొందరు.. అక్కడ మెయింటెనెన్స్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇండ్లలో నివాసం ఉండకుంటే పట్టాలను రద్దు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతూ ఒక్కో ఇంటికి నెలకు రూ.2వేల చొప్పున వసూలు చేస్తున్నారని ఖైరతాబాద్ సెగ్మెంట్ సోమాజిగూడ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. తమ ఇండ్లు తమకే ఉండాలంటే నెలకు మెయింటెనెన్స్ చార్జీలు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారని, ప్రతి బ్లాక్‌కో అడ్మిన్ అవతారమెత్తి తమ వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదిగా తమ గృహాలకు తాగునీటి సరఫరా లేదని, విద్యుత్ కోతలు ఉండడంతో దిక్కుతోచని స్థితిలో సొంతిళ్లను వదిలి కిరాయిండ్లలో ఉండాల్సి వస్తున్నదని లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు.

రూ.500 ఇస్తేనే..

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ● అధికారుల తీరుపై బస్తీవాసుల ఆందోళన

అల్లాపూర్: రూ. 500 ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పరిశీలిస్తున్నారంటూ.. బస్తీవాసులు ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగడం లేదని, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు అవకతవకలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారం అధికారులు అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూఅల్లాపూర్‌లో ఇంటింటికెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. ఈ క్రమంలో దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా జరగడం లేదని, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు అవకతవకలు చేస్తున్నారని బస్తీవాసులు ఆరోపిస్తూ...పెద్దఎత్తున రోడ్ల పైకి ఆందోళన చేశారు. రూ. 500 ఇచ్చిన వారి దరఖాస్తులనే పరిశీలిస్తున్నారని, పైసలు ఇవ్వని వారికి సాకులు చెప్పి.. తరువాత వచ్చి పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నట్లు స్థానికులు మండిపడ్డారు. ఈ క్రమంలో న్యూఅల్లాపూర్‌లో పర్యటించిన కార్పొరేటర్ సబీహాబేగంను కలిసిన బస్తీవాసులు.. తమ గోడు వెల్లబోసుకున్నారు. న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహాబేగం మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించి అర్హులైన పేదలకే ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల కేటాయింపులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని నిరుపేదలకే ఇండ్లు దక్కేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ..అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు నజీర్, శివరాజ్, మల్లికార్జున్, జాఫర్, బషీర్, అఫ్రాఫ్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం